సమ్మర్ క్యాంపులో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ సందర్భంగా సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా డ్రాయింగ్ పోటీలను డ్రాయింగ్ మాస్టర్ జవహర్, రమా నిర్వహించగా 30మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారులు ఆర్.లలిత, మధుబాబు, గజేంద్రబాబు, భాను, లవ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత

కలెక్టర్ సగిలి షన్మోహన్

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రోజువారి జీవనశైలిలో కొంత మార్పులు చేసుకొని పర్యావరణ గురించి ఆలోచించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీ, పర్యావరణ పరిరక్షణ శాఖల ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, శిక్షణ కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలసి గ్రీన్‌ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈర్యాలీ గాంధీ సర్కిల్ నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్, దర్గా సర్కిల్, చౌడేశ్వరి అమ్మ సర్కిల్, గంగినేని చెరువు కట్ట మీదుగా నగరవనం వరకు కలెక్టర్, డిఎఫ్ఓ, ఎస్పీ, జేసి, శిక్షణ కలెక్టర్ సైకిల్ తొక్కుతూ ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీ, డిఎఫ్ఓ, జేసి, శిక్షణా కలెక్టర్ మొక్కలను నాటి నీరుపోసి, అటవీ ఉత్పత్తులు అడవిలో ఉన్న జంతువులు, విషసర్పాలు, ఎర్రచందనం, ఏనుగుల దంతాలు వంటి వాటికి సంబంధించి అటవీశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ఎస్పీ ప్రారంభించి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని, ప్రతిఒక్కరు రోజు వారీ జీవన శైలిలో కొంత సమయాన్ని పర్యావరణ పరిరక్షణకు కేటాయించాలని, ప్రతి రోజు మనం చేసే పనిలో కొంత పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేయాలన్నారు.

నగర పాలక సంస్థ మేయర్ అముద మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షణ చూడాలని, ప్లాస్టిక్ వాడడం పూర్తిగా నిలిపివేయాలన్నారు. డిఎఫ్ఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం జీవనశైలి లైఫ్ మిషన్ ద్వారా గత 15 రోజులుగా జిల్లా 36 వేల మందికి పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 13వందల క్యాంపులు నిర్వహించి అడవులను రక్షించడం, అడవులవల్ల కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా పర్యావరణాన్ని రక్షించాలని ఉద్దేశంతో రెండు రోజుల ముందు ప్రణాళిక చేయడంతో ప్రజలు, సైకిల్ ర్యాలీ పాదయాత్ర ర్యాలీకి పట్టణ ప్రజలు యువత పెద్దఎత్తున గ్రీన్ ర్యాలీలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. జేసి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి ఆలోచించాలని, కలుష్యాతం లేనివిధంగా చేయడం ప్రతిఒక్కరి బాధ్యతని, పట్టణంలో మొక్కలను నాటి వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నురు. అప్పుడే పర్యావరణాన్ని మనం కొంత వరకు రక్షించుకున్న వారం అవుతామన్నారు. ఈ సందర్భంగా పర్యావరణం కోసం జీవనశైలి ప్రతిజ్ఞను డిఎఫ్ఓ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో సామాజిక అటవీశాఖ అధికారి సోముశేఖర్, పర్యావరణశాఖ ఏడి కిశోర్, డిఎస్పీ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ మేనేజర్ గుణశేఖర్, అటవీ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పట్టణ ప్రజలు, ఎన్‌జిఓలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న జడ్జి కరుణకుమార్

చెట్లను నరకడం చట్టరిత్యా నేరం

న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణ కుమార్

అడవి జంతువులను చంపడం, చెట్లను నరకడం చట్టరిత్యా నేరమని జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నగరవనంలో జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డితో కలిసి ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సిఎంసి ఆసుపత్రి, ఆర్‌కె. జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయవాదులు ఆనంద, బాలయ్య, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లైఫ్ స్టైల్ మార్చుకోవాలి: ఎస్పీ రిషాంత్ రెడ్డి

పర్యావరణకు అనుగుణంగా ఉన్న లైఫ్‌స్టైల్‌ని మనం అలవాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్, జెసి, డిఎఫ్ఓలతో కలిసి ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తి రోజువారీ జీవితంలో ఎంతోకొంత మార్పు తీసుకొస్తారని ఆశిస్తున్నామన్నారు.

పచ్చదనాన్ని పెంచుదాం..: ఎమ్మెల్యే

పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ పచ్చదనం పెంచేలా మొక్కలు నాటాలని ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. 50వ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక కట్టమంచి చెరుపు గట్టుపై మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో నగర మేయర్ అముద, కార్పొరేటర్లు హరిణిరెడ్డి, చుడా ఛైర్మెన్ పురుషోత్తంరెడ్డి, జ్ఞానజగదీష్, కోలా కిరణ్‌లు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న వారికి రక్షణ ఏదీ..? రాష్ట్ర ప్రచార జాతాలో నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: మున్సిపల్ ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 31న హిందూపూరంలో ప్రారంభమైన జీపుజాత సోమవారం పలమనేరుకు చేరుకుంది. ఈసందర్భంగా పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు నాగేంద్రబాబు, నాగరాజులు మాట్లాడుతూ... ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తామని వైసిపి మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొందన్నారు. 98శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అవుట్సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల కార్మికుల పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారిందన్నారు. కరోనా సమయంలో పనిచేసిన అదనపు కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. కార్మికులను రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని చెప్పారు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామన్న ప్రభుత్వం నాలుగు సంవత్సరాలైన చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, గోపి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర, మున్సిపల్ వర్కర్స్ నాయకులు గోవిందరాజులు, మంజుల, నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గిరిధర్ గుప్తా, భవన నిర్మాణ సంఘం యూనియన్ నాయకులు ఆంజనేయులు, రాజా, లక్ష్మయ్య, ఎల్ఐసి నాయకులు మునిరాజులు, కుమారస్వామి రెడ్డి, ఇంజనీర్ కార్మికులు ప్రసాద్, రాజేష్, అనుభూ, మురుగేష్, శివ తదితరులు పాల్గొన్నారు.


పలమనేరు సభలో మాట్లాడుతున్న నాయకులు

కుప్పం: ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూన్న వారికి రక్షణ ఏదీ అనిసిఐటియు రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నాగరాజు ప్రశ్నించారు. జగనన్న హామీల అమలు కోసం మున్సిపల్ కార్మికుల ప్రచార జీపు జాతాలు విజయవంతం చేయాలని కోరారు. సోమవారం పట్టణంలోని ఇంజనీరింగ్ కార్మికులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలోని వేలాది మంది కార్మికులను కలుసుకొని వారి బాధలు కష్టాలు అధ్యయనం చేసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారందరి నుంచి సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 8వ తేదీ విజయవాడలో జరిగే ముగింపు సభకు కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, మున్సిపల్ వర్కర్స్ నాయకులు గోవిందరాజులు, మంజుల, నాగరాజు పాల్గొన్నారు.

కుప్పంలో ప్రచార జీపు జాతా

'స్పందన'కు 292 అర్జీలు


స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సగలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 292 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 174, హౌసింగ్ శాఖ 8, పట్టుపరిశ్రమ 2, ఉధ్యానశాఖ 1, పోలీసుశాఖ 3, సబ్ రిజిస్ట్రార్ 2, జిల్లా ఎంప్లాయిమెంట్ 1, బిఎస్ఎన్ఎల్ శాఖ 1, సైనిక్ వెల్ఫేర్ 1, జిల్లా విద్యాశాఖ 1, సమగ్ర శిక్ష 2, నగర పాలక సంస్థ 1, ఎల్‌డిఎం 1, పంచాయతీరాజ్ 8, నేషనల్ హైవే 1, పింఛన్లు, రేషన్ కార్డ్స్ 85, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు తమ వినతులను అందజేశారు. స్పందనలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

సకాలంలో 'స్పందన' వినతులు పరిష్కారం

కమిషనర్ డాక్టర్ జె.అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమంలో అందే వినతులపై సంబంధిత విభాగాల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. వినతులను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గతవారం అందిన వినుతులపై సమీక్షించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం 2, ఇంజనీరింగ్ 1, మెప్మా 1 చొప్పున మొత్తం 4 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్‌పి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 20 ఫిర్యాదులు అందగా వాటి వివరాలు. ఇంటి తగాదాలు 2, చీటింగ్ 3, కుటుంబ తగాదాలు 4, వేదింపులు - 1, ఆస్తి తగాదాలు 2, భూ తగాదాలు 9 ఉన్నాయి.

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

'జగనన్నకు చెబుదాం' పై ప్రత్యేక శ్రద్ధ: జెసి

జగనన్నకు చెబుదాం, స్పందన సమస్యలపై అధికారులతో సమీక్షిస్తున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదు అయ్యే ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం, స్పందన, మీ సేవా, ఏపీ సేవా తదితరాంశాలకు సంబంధించి వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్‌లు, ఎంపిడిఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల సత్వర పరిష్కారంకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని మరింత మెరుగైన సేవలు ప్రజలకు అందించడానికి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదు అయ్యే ఫిర్యాదుల పరిష్కారంపై అదికారులు ప్రత్యేక దష్టిపెట్టి పనిచేయాలని అన్నారు. స్పందన అర్జీలను సకాలంలో నిర్ణీత గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా కేసుల వివరాలను పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై జేసీ అధికారులతో సమీక్షించారు. చిన్న పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియపై ఐసిడిఎస్ శాఖ అధికారులు సంబంధిత మండల అధికారులతో సమన్వయం చేసుకొని నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, హౌసింగ్ పిడి పద్మనాభం, జడ్పీ సిఈఓ ప్రభాకర్ రెడ్డి, ఇరిగేషన్, పిఆర్, ఎస్ఈలు విజయ్ కుమార్‌రెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఏ, మెప్మా, డ్వామా పిడిలు తులసి, రాధమ్మ, గంగాభవాని, డిపిఓ లక్ష్మీ, సంక్షేమశాఖల అధికారులు రాజ్యలక్ష్మీ, నరసింహం, మూర్తి, చిన్నారెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు రేణుక, సుజన, శివయ్య ఎంపీడీఓలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

చేయాల్సిన పనులు చేయకుంటే ఎలా...?

తహశీల్దార్ తీరుపై జెసి అసహనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

తహశీల్దార్ చేయాల్సిన పనులు కూడా చేయడం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్ నుంచి డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఇంటిపట్టాలు, బర్రెలగ్రౌండ్, పట్టాదారు పాసుపుస్తకం, రీసర్వే, ఆధార్ సీడింగ్ భూములకు సంబంధించి సమస్యలపై చిత్తూరు, నగరి, కుప్పం ఆర్డీఓలు, మండల తహశీల్దార్లు, మండల సర్వేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కొందరు తహశీల్దార్లు పరిధిలో చేసే పనులను కూడా చేయడం లేదని, మీరు చేయవల్సిన పనులను మాత్రమే చేయమని చెప్పుతున్నామన్నారు. ఇంకపై ప్రతినెలా సోమవారం సాయంత్రం రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనలో రెవెన్యూకు సంబంధించి సమస్యల అర్జీలు జిల్లా కలెక్టర్‌కి, జేసికి అందజేసిన అర్జీలకు ఎండార్స్‌మెంట్స్ వేసి తహశీల్దార్లకు పంపడం జరుగుతుందని, వాటిని 24గంటలలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రామకుప్పం, వి.కోట మండలాలకు సంబంధించి ఎక్కువ సమస్యలపై అర్జీలు వస్తున్నాయని తహశీల్దార్లు ప్రత్యేకదష్టి పెట్టి సమస్యలను పరిస్కారించాలని ఆదేశించారు. ఒక్క ప్రత్యేక డ్రైవ్ పెట్టి బర్రెల గ్రౌండ్స్, 22 ఏకి సంబంధించి వాటిని వారంలోగా పరిష్కరించి వచ్చే సోమవారం నాటికి రిపోర్ట్స్ తీసుకురావాలని అన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి, రీసర్వేకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రామాలను కూడా త్వరగా పూర్తి చేయాలని సర్వే రాళ్లు వచ్చినట్టుగా నటించి పూర్తి చేయాలన్నారు. చిత్తూరు, నగిరి, కుప్పం ఆర్డీవోలు మండల తహశీల్దార్లు, మండల సర్వేయర్లు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి

విజయ డెయిరీని కొనసాగించాలి

రైతు దీక్షకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో ఉన్న ప్రముఖ విజయ డెయిరీని తెరిపిస్తామని ప్రతిపక్షంలో పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని రైతు వెంకటాచలపతి నాయుడు చేస్తున్న నిరాహార దీక్షకు సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ జిల్లాకే తలమానికంగా ఉంటూ పాడు రైతులను ఆదుకొన్న విజయ డెయిరీని గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు సొంత డెయిరీ లాభం కోసం విజయ డెయిరీని ఉద్దేశపూర్వకంగా నష్టాలు ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. జిల్లాలో ఉన్న పాడి రైతులను గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటున్న పరిస్థితి విజయ డెయిరీ కల్పిస్తున్నదని అన్నారు. అయితే ప్రస్తుతం ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ జిల్లాలో అత్యధికంగా ఉన్న పాల రైతులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈసహకార ఫ్యాక్టరీని కాపాడాలని గతంలో అనేక రకాల పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు చేసిన తప్పిదం వలన జిల్లా ప్రజానీకానికి నష్టం చేకూరినది అప్పట్నుంచి వెంకటాచలపతి నాయుడు రైతు చెప్పులు, చొక్కా లేకుండా నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చిత్తూరుకు వచ్చిన సందర్భంగా విజయ డెయిరీ రైతులు కలిసి వినతిపత్రం ఇవ్వగా స్పష్టంగా హామీ ఇస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే మూతబడిన విజయ డెయిరీని ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోతూ నేడు విజయ డెయిరీ ఆస్తులను కారుచౌకగా అమూల్ కంపెనీకి కట్టబెట్టడానికి జగన్మోహన్ రెడ్డి తహతలాడుతున్నాడని అన్నారు. ఇప్పటికే 99సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్లు తెలుస్తున్నదని అన్నారు. లక్షలాది మంది రైతులు ఇబ్బంది పడుతుంటే ఎక్కడో ఉన్న గుజరాత్ ప్రైవేట్ కంపెనీకి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పాడి రైతులను కాపాడాలంటే విజయ డెయిరీని ప్రభుత్వమే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిపిఎం ప్రత్యక్ష కార్యాచరణ చేపడుతుందని తెలిపారు.

పోలీస్ మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఉద్యోగ నియామక ప్రతం అందిస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు హోంగార్డ్స్ యూనిట్‌లో జనవరి 3వ తేదీన విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన ఎస్.మురుగేషన్, సతీమని ఎం.సుమితకు కారుణ్య నియామకాల కింద 'సి' కేటగరిలో ఉద్యోగం కల్పిస్తూ పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. అలాగే జూన్ 15వ తేదీన విధులు నిర్వహిస్తూ మరణించిన కె.హరిత కుటుంబసభ్యులకు హోంగార్డ్స్ ఫండ్స్ నుండి రూ.4లక్షల చెక్కును ఎస్పీ రిషాంత్ రెడ్డి అందజేశారు. ఆమె కుటుంబానికి భరోసా ఇస్తూ పోలీస్ డిపార్టుమెంట్ తరపున వారి కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డి ఎస్పీ మురళీధర్ పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

17 వరకు అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 5వ తేదీ సోమవారం నుండి 17వ తేదీ వరకు వరకు జరగబోవు ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డయేరియా నిర్మూలణ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. ఈమేరకు సోమవారం డయేరియా నిర్మూలనపై ముద్రించిన పోస్టర్లును ఆవిష్కరించారు. ఈనెల 17వ తేదీ వరకు ఆశా కార్యకర్త తన పరిధిలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లలున్న ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు డిస్ట్రిబ్యూట్ చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, వైయస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో, అంగన్వాడీ సెంటర్‌లో తప్పనిసరిగా ఓఆర్ఎస్ -జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలన్నారు. డయేరియా వ్యాధి వచ్చిన పిల్లలకు తప్పనిసరిగా 14 రోజులపాటు జింక్ అందించాలన్నారు. డయేరియా వ్యాధి రెండు, మూడు రోజులకు తగ్గిపోయినా జింక్ మాత్రం 14 రోజులపాటు తప్పనిసరిగా కంటిన్యూ చేయాలన్నారు.

టీచర్ పోస్టులు బ్లాక్ చేయడం అన్యాయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో టీచరు పోస్టుల ఖాళీలు బ్లాక్ చేయడం తీవ్ర అన్యాయమని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు దేవరాజులు రెడ్డి, నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, పవన్ కుమార్, జయరామయ్య, పరంధామ తదితరులతో కలిసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ బదిలీ కౌన్సిలింగ్ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని టీచర్లను గందరగోళానికి గురిచేస్తున్నాయని అన్నారు. అరకొరగా ఉన్న ఖాళీలను సైతం, జీవో నెంబర్ 47కు విరుద్ధంగా బ్లాక్ చేయడం అన్యాయమన్నారు. దీని వలన సీనియర్ టీచర్లు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. పదవీ విరమణకు దగ్గరగా వున్న టీచర్లను తప్పనిసరి బదిలీ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. అన్ని ఖాళీలు చూపకపోతే, బదిలీల వలన టీచర్లకు ఉపయోగం వుండదని తెలిపారు. ఉన్నత అధికారుల దృష్టికి అన్ని అంశాలను తీసుకెళ్తామని అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉపాధి కూలీలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్లచీమన పల్లి గ్రామ పంచాయతీ పరిధి, గుర్రాల చెరువు పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. దీంతో సోమవారం కూలీలను ప్రజాశక్తి పలకరించగా వారి బాధలను ప్రజాశక్తితో పంచుకున్నారు. వేసవికాలం ఎండకు పనిచేసి అలిసిపోతున్న తరుణంలో నీడ, నీరు ప్రభుత్వం వారు అందించక, గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూలీలు వాపోయారు. గతంలో వేసవికాలంలో 30% కూలి కలిపి పూర్తి కూలి ఇచ్చేవారని, ఇప్పుడు అలాగే చేస్తే మా బతుకులు మారతాయేమో అన్న ఆశతో కూలీలు ఎదురుచూస్తున్నట్లు వారు తెలిపారు.

కుటుంబ పోషణ భారంగా ఉంది

నాకు భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణకు కూలి పనులు చేసి బతకాల్సి వస్తుంది. ప్రస్తుతం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద రోజు కూలీగా పనిచేస్తున్నాను. గతంలో ఉపాధి కూలీకి వేసవికాలంలో 30% వేతనం కలిపి రూ.260 అందించేవారు. ప్రస్తుతం వారానికి రూ.1400 మాత్రమే వేతనంగా వస్తున్నది. ఈ డబ్బులతో పూటగడవక అప్పులు చేయాల్సి వస్తుంది **- నారాయణ రెడ్డి, ఉపాధి హామీ కూలి**

మౌలిక వసతులు కల్పించాలి

ఉపాధి పని చేసే ప్రదేశంలో ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటంతో విశ్రాంతి తీసుకునేందుకు నీడ లేదు. తాగడానికి సరైన నీరు కూడా అందుబాటులో ఉండదు. ఏమైనా గాయాలు అయితే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో ఉండదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పనిజరిగే ప్రదేశంలో కనీస మౌలిక వసతులు కల్పిస్తే బాగుంటుంది **- నందిని, ఉపాధి హామీ కూలి**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని మొగిలి సచివాలయం పరిధిలోని మొగిలి గౌరీ శంకర్ పురం, లక్ష్మీపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే తక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, కూరపా కార్పొరేషన్ డైరెక్టర్ అమర్‌నాథ్, సర్పంచ్ మనోరమ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: అభివృద్ధి సంక్షేమ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి గడపకూ అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకుని

అమలు చేస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొంగాట పంచాయతీ కొంగాటం సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొంగాటం, పిచ్చి గుండ్లపల్లి, కొండేపల్లి, కారకుంట, కొత్తూరు, మందలకుంట గ్రామాల్లో ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడచిన నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.70 కోట్లకు పైగా వ్యయంతో నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలవలు నిర్మించామని గ్రామాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత జయరామిరెడ్డి, ఎంపీపీ యువరాజ్, మండల పార్టీ కన్వీనర్ బాల గురునాథ్, మాజీ రెస్కో ఛైర్మన్, ఆర్‌హెచ్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కమల్, సమద్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమాలతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గోవిందరాజపురం, వినాయకపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జడ్పిటిసి నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, వైసీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్యామల శివ ప్రకాష్ రాజు తెలిపారు. సోమవారం మండలంలోని కష్ణ జమ్మాపురం, వనదుర్గాపురం రైతు భరోసా కేంద్రాల ఆవరణలో రైతులకు వేరుశనగ విత్తనం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కష్టాలు తెలుసుకొని వారి సొంత ఊరిలోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అందులో వ్యవసాయం సాగు చేయుటకు రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు తదితర వాటిని అందుబాటులో ఉంచిందని తెలిపారు. రైతులకు రైతు భరోసా పథకంలో ఏడాదికి రూ.13,500 ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తోంది. అనంతరం రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఒ ఢిల్లీ ప్రసాద్, సర్పంచ్ భానుప్రియ, రైతు రవి రెడ్డి, వాలంటీర్లు రోజా, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంగీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన సంగీత, నృత్య పోటీలు కోలాహలంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు వందమందికి పైగా చిన్నారులు ఈ పోటీలలో పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో ప్రతిభ చాటుకున్నారు. విజేతలకు బైరెడ్డిపల్లె ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, ఎస్ఐ వెంకటనరసింహులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను వెలుగులోకి తీసుకొచ్చి కళాకారులను ప్రోత్సహిస్తున్న కళాతరంగిణి కషి అభినందనీయమన్నారు. గత 30 ఏళ్లుగా కళాతరంగిణి సంస్థ 150 సంగీత, నత్య పోటీలు నిర్వహించి ఎంతోమంది చిన్నారులకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. ఎస్ఐ వెంకటనరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కళల్లోనూ రాణించాలన్నారు. ఇందుకోసం కళాతరంగిణి కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రకాష్, కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్ బాబు, సీనియర్ ఆర్టిస్టులు మస్తాన్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం భక్తుల గోవింద నామాల నడుమ వైభవంగా జరిగింది. మొదటగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ఆలయం వద్ద ప్రతిష్టించారు. అనంతరం ఆలయ మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని పార్లమెంట్ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షుడు స్వామి దాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీధర్ యాదవ్, పార్లమెంట్ టిడిపి ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరంలు అన్నారు. గంగాధర నెల్లూరు టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను 2024 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి అధినేతకు కానుకగా అందజేస్తామని పేర్కొన్నారు. ఎన్నికలకు ప్రజలు వేచి చూస్తున్నారని, వైసిపిని అధికారం నుంచి దింపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మరో వారం రోజులు తర్వాత డాక్టర్ థామస్ నియోజకవర్గంలో అన్ని మండలాలు పర్యటించి కార్యకర్తలతో ముఖాముఖి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. అధికార వైసీపీ ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినప్పటికీ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో టిడిపి విజయం సాధించడం ఖాయమని అన్నారు. సమావేశంలో టిడిపి నేతలు రాంబాబురెడ్డి, జ్యోతీశ్వర్ రెడ్డి, కేతినేని లోకేష్ నాయుడు, బాబు రెడ్డి, నటరాజ్ మొదలియార్, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లో హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-నగరి: స్థానిక కేవీకే మైదానంలో గత కొన్ని రోజులుగా పలు క్రీడల్లో ఉచిత శిక్షణ అందించి వారికి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ రసకందాయంగా జరుగుతోంది. ఈ క్యాంప్‌లో క్రికెట్‌లో శిక్షణ పొందిన అండర్ 14, అండర్ 16 క్రీడాకారులకు రోజా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సోమవారం శాప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. అండర్ 14లో గోదావరి, కష్ణా టీంల మధ్య మూడో పోటీ నిర్వహించగా ఒక్క పరుగుతో గోదావరి టీం విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు 30 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన కష్ణా జట్టు 30 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి ఒక్క పరుగులో ఓటమి పాలైంది. అండర్ 16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య 3వ పోటీ నిర్వహించగా గంగ జట్టు వికెట్లు నష్టపోకుండా విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యమునా జట్టు 30 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 251 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన గంగా జట్టు ఓపెనర్ రన్నర్‌లు సిద్దు 120, నరేంద్ర 101 అంటూ ఇద్దరూ సెంచరీలు కొట్టి నాటౌట్‌గా నిలవడంతో 28.4 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. సెంచరీలు కొట్టిన క్రీడాకారులను మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అభినందించారు. టోర్నమెంట్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు రోజా ఛారిటబుల్ ట్రస్టు చేపట్టినట్లు శాప్‌కోచ్ బాబు తెలిపారు.

కమిటీ నిర్ణయంతో పనులు కేటాయించాం



ప్రజాశక్తి-సోమల: గ్రామపంచాయతీలో వాటర్ షెడ్ పథకంలో మంజూరైన పనులను కమిటీ నిర్ణయంతో కేటాయించడం జరిగిందని వాటర్ షెడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభా రాణి అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కమిటీ ఛైర్మన్, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల "వాటర్ షెడ్ పనులు అయిన వారికేనా?" అన్న శీర్షికన ప్రజాశక్తిలో వార్త రావడం జరిగిందని అయితే పనుల కేటాయింపులో గాని పనులు చేపట్టిన ప్రాంతంలో కొలతలు తీయడం, ఇతర నిబంధనలు ఏవీ అధిగమించలేదని, కమిటీ సభ్యులు సూచించిన వారికే పనులు కేటాయించి, నిర్ణయించిన కొలతల మీదకే బిల్లులు చేశామని చెప్పుకొచ్చారు. సోమల పంచాయతీలో 26 పనులకు గాను రూ.58 లక్షల నిధులు మంజూరయ్యాయని, సదుం, సోమల మండలాలకు కలిపి మొత్తం రూ.4.64 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కాగా ఈరోజు జరిగిన సమావేశానికి కోరం లేకపోవడంతో తిరిగి మరొక రోజు సమావేశాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఛైర్మన్ సుమలత, వైస్ ఛైర్మన్ రాజారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రభాకర్, మొగిలప్ప శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రాణం పోయినా పార్టీ మారేది లేదు'

ప్రజాశక్తి-పలమనేరు: తమ ప్రాణం పోయినా తెలుగుదేశం పార్టీని వీడేది లేదని పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీ అయ్యంరెడ్డి పల్లి వాసులు పేర్కొన్నారు. సోమవారం పలమనేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు మీడియా సమక్షంలో తెదేపా కండువాలు కప్పుకొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపికి కంచుకోటలాంటి కొలమాసనపల్లి పంచాయతీ అయ్యం రెడ్డిపల్లి గ్రామం నుంచి సుమారు 20 కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలోకి బలవంతంగా కండువా కప్పి ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు. తమ గ్రామంలో పండుగ సందర్భంగా జల్లికట్టును ఏర్పాటు చేసుకోవాలని అందుకు అవసరమైన అనుమతులకు ఎమ్మెల్యే వెంకటే గౌడ దగ్గరకు వెళితే అక్కడున్న కొంతమంది వైసీపీ నేతలు మాకు బలవంతంగా పార్టీ కండువాలు కప్పి, మేము జగన్ మోహన్ రెడ్డి పాలన మెచ్చి వైసీపీలోకి వచ్చినట్లుగా కొంతమంది ప్రచారం చేశారని ఇది ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకుల సమక్షంలో నటరాజు, చంద్రప్ప, సుబ్రహ్మణ్యం, డి.ఎన్.చంద్రప్ప, శివకుమార్, ప్రవీణ్, రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, గురుస్వామి, రఘుపతి, వెంకటేష్, మనీ, వెంకటరామయ్య తదితరులు తెదేపా కండువాలు కప్పుకొన్నారు.

'అమ్మఒడి'లో ఆశ్రయం కల్పిస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎవరైనా అనాథలు ఉంటే అమ్మఒడికి సమాచారం అందిస్తే వారికి ఆశ్రయం కల్పిస్తామని అమ్మఒడి నిర్వాహకులు పద్మనాభ నాయుడు అన్నారు. 'ఆశ్రయం కల్పించి ఆదుకోండి' అనే శీర్షికన ప్రజాశక్తి పత్రికలో వార్తను ఆదివారం ప్రచురించడంతో చిత్తూరు అమ్మ ఒడి నిర్వాహకులు ఈ వార్తకు స్పందించి సోమవారం వారు మండలంలోని బొమ్మయపల్లి గ్రామానికి వెళ్లి ఆమెను చిత్తూరు అమ్మఒడికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శివలింగయ్య, నీరాజాక్షులు గౌడు, గ్రామస్తులు తులసి, జయ, అమ్మ ఒడి సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం పశు వైద్య శాఖ ద్వారా అందజేసిన జొన్న, మొక్కజొన్న విత్తనాలను ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ భాష మసూద్ రైతులకు పంపిణీ చేశారు. పశుగ్రాస కొరత తీరేందుకు రైతులకు జొన్న, మొక్కజొన్న విత్తనాలు ఎంతో ఉపయోగపడతాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సహదేవ, అనూష, రైతులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిని నివారిద్దాం

ప్రజాశక్తి-రొంపిచెర్ల: అతిసార వ్యాధిని నివారిద్దాం అని డాక్టర్ రాజా అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు రాజా, డాక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజా మాట్లాడుతూ ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు 5 నుంచి 17వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామాలలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5సం. వయసు కలిగిన పిల్లలున్న ఇళ్ళను సర్వే నిర్వహించాలని కోరారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌ఓ కాంతమ్మ, పీహెచ్ఎన్ పార్వతమ్మ, ఎంపీహెచ్ఎస్ పంకజా, ఎంఎల్ హెచ్ పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

యాదమరి: చిన్నపిల్లలు అతిసార బారిన పడకుండా ఉండేందుకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు యాద

మరి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కీనాటంపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి, అంగన్‌వాడీ వర్కర్, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... గంగాధర నెల్లూరు మండలం ముక్కళతూరు దళితవాడకు చెందిన పట్టాభి (56) గంగాధర నెల్లూరుకు ద్విచక్రవాహనంలో వచ్చి తిరిగి వెళుతుండగా అదే సమయానికి టిప్పర్ వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనదారుడు పట్టాభికి కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కులప్రస్తావన తీసుకురావడం సరైంది కాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పూతలపట్టు, జీడి నెల్లూరు నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు గడపగడపకు కార్యక్రమం సందర్భంగా అగ్ర కులస్తులు ఎస్సీ ప్రజాప్రతినిధులు వస్తున్నారని సాకుతో ఇళ్లకు తాళాలు వేశారని ప్రజాప్రతినిధులు తెలిపారు. మాపై వివక్షత చూపుతున్నారని వారిపై కేసులు పెట్టాలని ప్రకటించారు. అదే నిజమైతే కులాల ప్రాతిపదికన అలా చేయడం సరైంది కాదని, ఈ ఘటనలను సిపిఎం చిత్తూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ కులాల ప్రాతిపదికను వ్యవహరించడం సరైంది కాదన్నారు. డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, పూతలపట్టు శాసనసభ్యులు బాబులు పత్రిక ముఖంగా తెలియజేస్తూ దళితులు వెళితే అగ్రకులస్తులు తాళాలు వేసుకుని వెళ్లారని తెలియజేశారు. గ్రామంలో అగ్రకులాల వారు సమస్యల ప్రాతిపదికన నిరసనలు తెలియజేయాలని కులవివక్ష పద్ధతిలో వ్యవహరించడం సరైనది కాదన్నారు. రకరకాల పద్ధతుల్లో నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని అలా కాకుండా దళితులు వచ్చారని పసుపు నీళ్ళు చల్లడం ఇలాంటి సాంప్రదాయాలను కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు కూడా సంయమనం పాటించి అందర్నీ కలుపుకొని వెళ్లే విధంగా, కక్ష సాధింపు మానుకొని సామరస్యంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు కూడా ఆ పద్ధతిలో వ్యవహరించాలి కానీ కుల మతాలకు అతీతంగా గ్రామాల్లో ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఇలాంటి పద్ధతులు ఏ కులస్తులు చేసినా చట్టరీత్యా నేరమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పీఏసీఎస్ పెట్రోల్ బంక్ సందర్శన

ప్రజాశక్తి-నగరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం (పీఏసీఎస్) ద్వారా నిర్వహించే పెట్రోల్ బంక్‌ను సోమవారం ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి సందర్శించారు. బంక్ నిర్వహణా తీరు, వ్యాపార లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 76 సంఘాలలో నగరి పీఏసీఎస్ మొట్టమొదటిసారిగా హెచ్‌పి పెట్రోల్ బంకు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘంలో చేపట్టే ఎరువులు, వరివిత్తనాలు, పురుగుల మందుల అమ్మకాలు, బంగారు ఆభరణాలకు రుణాలు ఇచ్చే తీరు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. సంఘము నందు నిర్వహించుచున్న లాకర్ సౌకర్యమును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాసులురెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈవో ఇ.మనోహర్ గౌడ్, ఆప్కాబ్ మేనేజర్ ప్రసాద్, పీసీఎస్ ఛైర్మన్ తిరుమలరెడ్డి, డైరెక్టర్ దామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నామఫలకాలు తెలుగులో ఉండేలా చూడాలి

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని వాణిజ్య సముదాయాలకు, వ్యాపార సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, నామఫలకాలు తెలుగులో ఉండేలా చూడాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు సోమవారం స్పందన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పవిత్ర మురళి కష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార తెలుగు భాష చట్టం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మాతభాష తెలుగులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు పి తులసి నాథం నాయుడు, శ్రీపురం సీతారామయ్య , సమితి సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలో జరగనున్న చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని సోమవారం మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు నాయుడు మాట్లాడుతూ ఈ నెల 14, 15, 16 తేదీల్లో చంద్రబాబు పర్యటన ఉంటుందని, కావున ఆయా గ్రామపంచాయతీలో సమాచారాన్ని నాయకులకు, కార్యకర్తలకు తెలియజేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ జడ్పిటిసి బెటప్ప నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ హేమాంబర్ గౌడు, నాయకులు పాల్గొన్నారు.

విత్తనాలు తీసుకున్న రైతులు పంట వేయాలి

ప్రజాశక్తి-గంగవరం: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాలు తీసుకొన్న రైతులు తప్పనిసరిగా పంట వేయాలని, అలా పంట వేయకపోతే ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, సున్నా వడ్డీ లాంటివి వర్తించవని మండల వ్యవసాయ అధికారిణి సరిత అన్నారు. సోమవారం ఆమె రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో మార్కెట్లో 30 కేజీల వేరుశనగ విత్తనాలు రూ.2700 ఉండగా, రాయితీ పోను రూ.1674 లకు బస్తా పంపిణీ చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో తప్పనిసరిగా రైతులు విత్తనాలు పండించాలి అన్నారు. ప్రస్తుతం గంగవరం మండలానికి 1469 బస్తాలు రావడం జరిగిందని, వీటిని పంపిణీ చేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వధూవరులను ఆశీర్వదించిన మొగసాల కృష్ణమూర్తి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల వైస్ ఎంపీపీ నారాయణస్వామి తమ్ముడైన రవిచంద్ర, కల్పనకు కొన్ని రోజుల క్రితం వివాహమైన విషయం విధితమే. సోమవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఎలక్షన్ అబ్జర్వర్ మొగసాల కృష్ణమూర్తి, వారి ఇంటి వద్దకు వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వధూవరులను ఉద్దేశించి కృష్ణమూర్తి మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలతో రాజంపేటలో ఉండటంతో మీ వివాహ మహోత్సవానికి రాలేకపోయానని తెలిపారు. ఆరోజు పెళ్లికి రావడానికి వీలు కాలేదు. ఈరోజు వచ్చి మిమ్మల్ని కలిసాకే నా మనసు సంతప్తిగా ఉందన్నారు. అనంతరం వారిని పిల్లాపాపలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని దేవదేవుని కోరుకుంటున్నానని దీవించారు. స్థానిక సర్పంచ్ రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ కార్తికేయన్, గొల్ల చీమనపల్లి సర్పంచ్ ఝాన్సీ నాగభూషణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాడిఆవుల వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: పాడి ఆవులకు వచ్చే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం ఎస్ఎంఐఎల్ఈ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. రమణయ్య అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బండ క్రిందపల్లి గ్రామపంచాయతీ, మట్లోల్లపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రైతులకు పశు వైద్య శిబిరంలో గర్భకోశ పరీక్షలు, పిడుదుల మందు పిచికారి, నట్టల నివారణ పిచికారి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు నాయుడు, మండల పశు వైద్యాధికారి శ్రీధర్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పూర్తి స్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు పార్టీ కార్యక్రమాల పై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. అనంతరం ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అబ్దుల్ గని, రఫీబ్ ఖాన్, సురేష్ రెడ్డి, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-రామకుప్పం: వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. సోమవారం టిడిపి మండల స్థాయి నేతలు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. పత్రా నారాయణ చారి, కష్ణ నాయక్, గంట్లప్ప గౌడు, శ్రీనివాసులు రెడ్డి, కోదండ రెడ్డి, గంట్ల రెడ్డి, శ్రీరాములు రెడ్డి, కామరాజు నాయక్, టీవీ రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ మన చేతుల్లోనే

ప్రజాశక్తి-నగరి: పర్యావరణ రక్షణ మన చేతుల్లోనే ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ నినాదాలు చేయించారు. పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలు పెంచాలన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు గోపాల్ విద్యార్థులకు అవగాహన ఏర్పరిచారు. డీఈ నరేష్‌బాబు, ఏఈ రమేష్, మేనేజర్ శేఖర్, టీపీవో నీరజాక్షి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, మున్సిపల్, వార్డ్ పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో సోమవారం డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లక్కనపల్లి పంచాయతీ పరిధిలో ప్రపంచం పర్యావరణ దినోత్సవం పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది కలిసి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం

పలమనేరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలమనేరు పట్టణంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో పలమనేరు బాలాజీ, పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్రతో కలిసి సోమవారం మొక్కలు నాటారు. పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కుప్పం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అటవీశాఖ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమ వారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కుప్పం ఇన్‌ఛార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వైసీ రెడ్డి, కుప్పం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కష్ణప్రసాద్, ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి ఉపేంద్ర, కుప్పం ప్రజావేదిక మునిరాజు బాబు, డా.వరదరాజులు, అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అధ్యాపకులు సత్యనారాయణ, ఇవిఆర్ నాయక్, సుధ, విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించి ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.